
సాక్షి ఒడిశా

సోమవారం । 29 । సెప్టెంబర్ । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు: రూ. 5,85,225
వెండి: 30 గ్రాముల 300 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



క్రీడలతో మానసిక ఉల్లాసం

క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కడ్రక అభిప్రాయపడ్డారు. - 8లో



వైభవంగా ఆర్‌ఎస్‌ఎస్ శత వార్షికోత్సవం

సరస్వతీ శిశు విద్యామందిర్ ప్రాంగణంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతవార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

ఆకట్టుకుంటున్న 'పూరీ' పెండల్



పపడాహండిలో దసరా పెండల్

కొరాపుట్: పూరీ దివ్యధాం నమూనాలో నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండిలో ఏర్పాటు చేసిన దసరా పెండల్ విశేషంగా ఆకట్టుకుంటోంది. ఏటా అవిభక్త కొరాపుట్ జిల్లాలలో అత్యంత ఖరీదైన దసరా పెండల్స్ ఏర్పాటు చేస్తుంటారు. కోల్‌కతా శిల్పులను రప్పించి నిర్మిస్తారు. వీటిని తిలకించేందుకు ఏటా లక్షలాది మంది ప్రజలు తరలివస్తారు.

పది కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన నిందితులతో పోలీసులు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ అబ్కారీ శాఖ అధికారులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు మునిగుడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుట్రాగుడ కూడలిలో దాడులు నిర్వహించారు. పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అరెస్టయిన వారిలో బలరాం పూజారి, స్వరలీ పాత్రో ఉన్నారు. ఫుల్బాణి జిల్లా బలిగుడకు గంజాయి అక్రమంగా తరలిస్తుండగా వీరు పట్టుబడ్డారు.

శుభేందుకు ఉత్తమ కొరియోగ్రాఫర్ అవార్డు



స్పీకర్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న శుభేందు మోహన్ సేనాపతి

పర్లాకిమిడి: ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని భువనేశ్వర్‌లోని జయదేవ్ భవన్‌లో ఒడిషా పర్యాటక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పర్లాకిమిడి మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ మాస్టర్ శుభేందు మోహన్ సేనాపతికి ఉత్తమ కొరియోగ్రాఫర్ అవార్డు లభించింది. ప్రపంచ టూరిజం దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర శాసనసభ స్పీకర్, కార్యదర్శి సురమా పాఢి చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. అకుంఠిత దీక్షతో చేసిన కృషికి ఫలితం లభించిందని పురపాలక సంఘం చైర్మన్ నిర్మలా శెఠి అభినందించారు. ఈ సందర్భంగా శుభేందును పర్లాకిమిడిలో పలు నృత్య సంస్థలైన పదామృత నృత్య అకాడమీ, జగన్నాథ డ్యాన్సు అకాడమీ నిర్వాహకులు అభినందించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న దాతలు

జయపురం: జయపురంలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయి నూతన ప్రార్థన మందిరంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు స్వచ్ఛందంగా హాజరై 25 యూనిట్ల రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జయపురం సబ్ డివిజన్ రక్తదాతల మోటివేటెడ్ అసోసియేషన్ కార్యదర్శి ప్రమోద్ కుమార్ రౌళో మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్లు అభయ కుమార్ పండా తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న భక్తురాలు

మధ్యవర్తిత్వమే మేలు

- సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక
- జాతీయ మధ్యవర్తిత్వ సమావేశంలో గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు



గవర్నరు, ముఖ్యమంత్రితో సమావేశానికి హాజరైన న్యాయ ప్రముఖులు



జాతీయ సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు

భువనేశ్వర్: వివాదాస్పద పరిస్థితుల్లో న్యాయమైన, స్నేహపూర్వక, శాశ్వత పరిష్కారాలకు మధ్యవర్తిత్వమే అత్యున్నత మార్గమని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. స్థానిక లోక్ సేవా భవన్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ద్వితీయ జాతీయ మధ్యవర్తిత్వ సమావేశం – 2025 నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ పరిమిత వ్యక్తులు, వర్గాల మధ్య పరిమితం కావలసిన వివాదాలు కోర్టు వరకు పోకుండా గుట్టుగా పరిష్కరించుకుని సామాజిక సామరస్యాన్ని బలోపేతం చేయడానికి మధ్యవర్తిత్వం ముఖ్యమైన సాధనమని పేర్కొన్నారు. కోర్టుల్లో వివాదాలకు ఉత్తమ ప్రత్యామ్నాయంగా సంబంధాలను మెరుగుపరిచి పునరుద్ధరించే చక్కని సంస్కరణ ప్రక్రియగా అభివర్ణించారు. దేశ వ్యాప్తంగా పలు న్యాయ స్థానాల్లో 4 కోట్లకు పైగా కేసులు మగ్గుతున్నాయని, సామాజిక ఐక్యతను ప్రోత్సహించడంతో పాటు న్యాయ వ్యవస్థపై భారాన్ని తగ్గించడానికి మధ్యవర్తిత్వం అనివార్యమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మధ్యవర్తిత్వ చట్టం – 2023 చట్టబద్ధమైన అమలుతో ఆచరణకు నోచుకోవడం భారత న్యాయవ్యవస్థలో మైలురాయి దశగా నిలిచిపోయిందన్నారు. బలహీన వర్గాలకు, సమ్మిళితత్వం, న్యాయబద్ధత, ప్రజా విశ్వాసాన్ని నిర్ధారించడంలో ఈ ఆచరణ ప్రయోజనాత్మక చర్యగా కొనసాగాలని పిలుపునిచ్చారు.

- భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అత్యంత వేగవంతమైన వివాద పరిష్కార వేదికగా, ఊపందుకుంటున్న వ్యవస్థగా పేర్కొన్నారు. వాదోపవాదాలతో కూడిన ఇరుపక్షాల మధ్య గెలుపు, ఓటమి అతీతంగా సంభాషణ, అవగాహన, పరస్పర సహకారంతో వివాద పరిష్కారాలకు పూర్తి అవకాశం కల్పిస్తుందన్నారు. ఇందుకు పలు అనుభవపూర్వక చారిత్రాత్మక సంఘటనలు అద్దం పడుతున్నాయని చెప్పారు.
- భారతదేశ రాజకీయ, సామాజిక అనుభవాలకు మధ్యవర్తిత్వం కొత్తేమీ కాదన్నారు. మధ్యవర్తిత్వ చట్టం, 2023 కింద అధికారిక క్రోడీకరణకు ముందే మన ప్రక్రియలలో అంతర్భాగంగా కీలక పాత్ర పోషించిందన్నారు.
- ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి మాట్లాడుతూ పలు న్యాయస్థానాల్లో పేరుకుపోతున్న కోట్లాది కేసుల విచారణతో న్యాయమూర్తులు, న్యాయవాదులు సతమతమై అపారమైన ఒత్తిడికి లోనవుతున్న పరిస్థితుల్లో మధ్యవర్తిత్వం చక్కని పరిష్కారం అందిస్తుందన్నారు. ఈ చర్యతో కోర్టులపైనా ఒత్తిడి తగ్గి ప్రజలు త్వరగా, సులభంగా న్యాయం పొందుతారని చెప్పారు. మధ్యవర్తిత్వం సంబంధాల పునరుద్ధరణతో కుటుంబాలు, వ్యాపారాలు, సామాజిక వర్గాల్లో సామరస్యాన్ని కొనసాగించడానికి వీలు కల్పిస్తుందన్నారు.
- ఒరిస్సా హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి హరీష్ టాండన్ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ప్రోత్సహించి సమాజంలో ఉనికిని నిర్ధారించుకుని వేగవంతమైన వివాద పరిష్కార మాధ్యమంగా కొత్త ఆలోచనలను ప్రేరేపిస్తుందన్నారు.
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం శాశ్వత పరిష్కారాలను పెంపొందిస్తుందన్నారు. భారత అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి మాట్లాడుతూ అన్ని జాతీయ న్యాయ పాఠశాలల్లో మధ్యవర్తిత్వంపై పూర్తి స్థాయి కోర్సులు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, అడ్వకేట్ జనరల్ పీతాంబర్ ఆచార్య, ఒడిశా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానస్ రంజన్ పాఠక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రముఖ న్యాయ నిపుణులు

పాతపట్నం-పర్లాకిమిడి రోడ్డులో చెట్ల కొమ్మలు నరికివేత



పాతపట్నం-కమిడి రోడ్డులో మోడుబారిన వృక్షాలు



పాతపట్నం రోడ్డులో చెట్ల కొమ్మలను తొలగించిన దృశ్యం

పర్లాకిమిడి: పాతపట్నం (ఆంధ్రప్రదేశ్) పర్లాకిమిడి రోడ్డు ఇరుపక్కన ఉన్న భారీచెట్ల కొమ్మలను నరికివేసి బాటసారులకు నీడ లేకుండా చేశారు. జిల్లా అటవీ శాఖ అధికారులను సంప్రదించిన అనంతరం టాటా పవర్ డిస్ట్రిబ్యూషన్ అధికారులు విద్యుత్ లైన్లకు అడ్డం వస్తుండటం వల్ల వీటిని తొలగిస్తున్నట్టు చెబుతున్నారు. పర్లాకిమిడి మెడికల్ నుంచి 500 మీటర్లు మహేంద్రతనయ నది వంతెన వరకూ చెట్ల కొమ్మలను నరికివేశారు.

హాస్టల్ విద్యార్థి మృతి



ఆందోళనకారులతో చర్చలు జరుపుతున్న అధికారులు

- ఆందోళనకు దిగిన ప్రతిపక్షాలు



ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుభాష్ గోండో తదితరులు

కొరాపుట్: హాస్టల్ విద్యార్థి మృతితో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ సబ్ డివిజన్ రాయిఘర్ సమితి తురిడి గ్రామ పంచాయతీలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ హాస్టల్లో 7వ తరగతి చదువుతున్న మంగళ సింగ్ గొండో (12) మృతి చెందాడు. కొద్ది రోజులుగా అస్వస్థతకు గురైనా వార్డెన్ పట్టించుకోకపోవడంతో అచేతన స్థితికి వెళ్లిపోయాడు. తర్వాత కూడా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించకుండా ఆర్‌ఎంపీ వైద్యునికి చూపించడంతో అప్పటికే పరిస్థితి విషమించింది. వెంటనే హతబరండి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ఉమ్మర్‌కోట్ డివిజన్ ఆస్పత్రికి తరలించేటప్పటికే విద్యార్థి మృతిచెందాడు. విద్యార్థి అనారోగ్య విషయం తల్లిదండ్రులకు తెలియజేయకపోవడంతో వివాదం చెలరేగింది. ఈ ఘటన జరిగిన ప్రాంతం రాష్ట్ర ప్రాథమిక విద్యా, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గొండో సొంత నియోజకవర్గ పరిధిలోనిది. ఈ విషయం తెలిసిన వెంటనే ప్రతిపక్ష బీజేడీ, కాంగ్రెస్ నాయకులు మూకుమ్మడిగా వెళ్లి సమితి విద్యాధికారి కార్యాలయానికి తాళాలు వేసి ఆందోళనకు దిగారు. ఘటన జరిగిన హాస్టల్‌లో రాత్రి పూట ఫ్యాన్ తప్ప ఎవరూ ఉండరని విద్యార్థులు పేర్కొనడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. మాజీ ఎమ్మెల్యే సుబాష్ గొండో తదితరులు ఆందోళనకు దిగారు. చివరకు ఉన్నతాధికారులు స్పందించి ఘటనపై దర్యాప్తు చేయించి బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

'మాస్టర్ మైండ్' ప్రభ అరెస్ట్

- మరో ఇద్దరు గంజాయి స్మగ్లర్లు కూడా..



వివరాలు తెలియజేస్తున్న సీఐ దివాకర్ యాదవ్. చిత్రంలో నిందితులు

అల్లిపురం (విశాఖ): కొన్ని రోజులుగా తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు గంజాయి స్మగ్లర్లను మహారాణిపేట పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. మహారాణిపేట పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ దివాకర్ యాదవ్ ఈ వివరాలు వెల్లడించారు. ఒడిశా–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని గోమంగి గ్రామానికి చెందిన పృథ్వీరాజ్ అలియాస్ ప్రభ గంజాయి స్మగ్లింగ్‌లో ప్రధాన సూత్రధారి. అతను ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకువచ్చి.. గోమంగి నాని బాబు, లోచలి కుమారస్వామి అనే ఇద్దరు యువకుల సహకారంతో సరఫరా చేయిస్తున్నాడు. ప్రభకు గంజాయి రవాణాలో అపార అనుభవం ఉంది. తన ఎత్తుగడలు ఎవరికీ తెలియకుండా వ్యవహరిస్తూ.. మాస్టర్‌మైండ్‌గా మారాడు. కాగా.. పాత నేరస్తుల నుంచి సేకరించిన సమాచారం, ప్రభ సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా శనివారం సాయంత్రం వైఎస్సార్ సెంట్రల్ పార్కు వద్ద అతన్ని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిపై గతంలో టూటౌన్, పెందుర్తి, శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస పోలీస్ స్టేషన్లతో పాటు గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్లలోనూ గంజాయి కేసులు నమోదై ఉన్నాయి. లోచలి కుమారస్వామి, గోమంగి నాని బాబులపై కూడా విశాఖ రైల్వే పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదై ఉన్నాయి. ఈ ముగ్గురు నిందితులను చాకచక్యంగా పట్టుకోవడంలో ప్రతిభ చూపిన సీఐ దివాకర్ యాదవ్, హెడ్ కానిస్టేబుళ్లు సురేష్, నంద కిశోర్, కానిస్టేబుల్ నాగేంద్రలను సీపీ, డీసీపీ–1, ఈస్ట్ ఏసీపీ అభినందించారు.

భగత్ సింగ్ ఆశయాలు కొనసాగిద్దాం

జయపురం: దసమంతపూర్‌లో విప్లవ వీరుడు సహిద్ భగత్ సింగ్ జయంతిని ఆదివారం నిర్వహించారు. అఖిల భారత యువ సంఘం కొరాపుట్ జిల్లా శాఖ అధ్యక్షుడు కుమార్ జాని నేతృత్వంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. జాని మాట్లాడుతూ ఆంగ్లేయుల పాలన నుంచి దేశాన్ని విముక్తి చేసేందుకు భగత్ సింగ్ ధైర్య సాహసాలతో పోరాటం చేశాడని, ఆయనను ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హరిబంధు నాయక్, సత్య పొరజ, భానుమతి, బొబిత ముదులి, తదితరులు పాల్గొన్నారు.

నందన్న పూజలు ప్రారంభం



నదీ జలాలను తీసుకువస్తున్న మహిళలు



కంద్రవీధిలో ప్రతిష్ఠించిన నందన్న విగ్రహం



జగన్నాథ మందిరం వద్ద కొలువదీరిన నందన్న

రాయగడ: నందన్న పూజలు ఆదివారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక కంద్రవీధి, జగన్నాథ మందిరం, బ్యాకరీలైన్ ప్రాంతాల్లో నందన్న పూజలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జంఝావతి నదీతీరానికి మహిళలు వెళ్లి కలశాలతో శుద్ధ జలాలను ఊరేగింపుగా తీసుకువచ్చి మండపాల్లో ఉంచడం ద్వారా అనంతరం పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటుగా జరగనున్న పూజలు అక్టోబర్ ఆరో తేదీతో ముగిస్తాయి.

చండీ రూపంలో అమ్మవారు



దీపాలంకరణలో అమ్మవారు



చండీమాత రూపంలో లక్ష్మీ అమ్మవారు



మజ్జిగౌరి అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



ఎరుపురంగులో ధలియాలతో పుష్పార్చన

రాయగడ: దసర శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు చండీ రూపంలో ఆదివారం భక్తులకు దర్శనం ఇచ్చారు. స్థానిక కస్తూరీనగర్‌లోని సత్యనారాయణ ఆలయం ప్రాంగణంలో లక్ష్మీ అమ్మవారిని చండీరూపంలో అలంకరించారు. అర్చకులు మావుడూరు కిశోర్ ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. స్థానిక రాణిగుడ ఫారంలో అమ్మవారి పూజల్లో భాగంగా దీపాలంకరణ ఆకర్షించింది. అదేవిధంగా ఎరుపురంగు గల ధలియాలతో పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. నవరాత్రులు సందర్భంగా మజ్జిగౌరి అమ్మవారు సునాబేసాలు దర్శనం ఇస్తుండటంతో ఆదివారం తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులతో మందిరం కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.

సీనియర్ల ఆశీర్వాదం కోసం..



జయరాం పంగి నివాసం వద్ద డీసీసీ అధ్యక్షుడు రుపక్ తురుక్

కొరాపుట్: కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడు రుపక్ తురుక్ ఆ పార్టీ సీనియర్ల అశీర్వాదం తీసుకొనే యాత్ర ప్రారంభించారు. ఆదివారం కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కుందిలి గ్రామంలో సంత వద్ద నివాసం ఉంటున్న మాజీ ఎంపీ జయరాం పంగి నివాసానికి వెళ్లి అతన్ని కలిశారు. పంగి సానుకూలంగా స్పందించి రుపక్‌ని సాదారంగా ఆహ్వానించి తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని అభయమిచ్చారు. రుపక్ వెంట మల్కన్‌గిరి మాజీ ఎమ్మెల్యే నిమయ్ సర్కార్ కూడా ఉన్నారు. రాష్ట్రంలో కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి ఎక్కువ ప్రాధాన్యత ఉంది. రాష్ట్రంలో కేవలం కొరాపుట్ ఎంపీ మాత్రమే కాంగ్రెస్ ఖాతాలో ఉంది. జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాల్లో మూడింట కాంగ్రెస్ గెలుపొందింది. ఈ జిల్లాలోని పొట్టంగి ఎమ్మెల్యే రాం చంద్ర ఖడం ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ శాసన సభా పక్షనేతగా ఉన్నారు. కాంగ్రెస్‌కు కంచుకోట వంటి కొరాపుట్ జిల్లాలో ఎంతో మంది సీనియర్లని కాదని యువకుడు రుపక్ తురుక్‌కి డీసీసీ అధ్యక్ష పదవి కట్టబెట్టడం గమనార్హం.

క్లుప్తంగా

బ్యాంగిల్ షాపు దగ్ధం


కాలిపోయిన సామగ్రి

టెక్కలి రూరల్: టెక్కలి ఎన్టీఆర్ కాలనీ 10వ లైన్‌లో కోటిపల్లి కృష్ణారావు, దమయంతికి చెందిన బ్యాంగిల్ షాపు దగ్ధమైంది. శనివారం రాత్రి 12 గంటల సమయంలో షాపు నుంచి పొగ రావడంతో చుట్టుపక్కలవారు గమనించి షాపు యజమానికి ఫోన్‌లో సమాచారం అందించారు. యజమాని హుటాహుటిన షాపు వద్దకు చేరుకోగా అప్పటికే మంటలు ఎగసిపడ్డాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే షాపులో చీరలు, ఫ్యాన్సీ సామగ్రి, గాజులు ఇతర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నరసన్నపేట: జమ్ము కూడలి వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన పోలాకి మండలం గాతలవలసకు చెందిన బమ్మిడి దామోదరరావు ఆదివారం ఉదయం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో (54) మృతి చెందాడు. స్థానిక హోటల్లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న దామోదరరావు డ్యూటీ ముగించుకొని జమ్ము కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం నుంచి టెక్కలి వైపు వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 అంబులెన్సులో నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. దామోదరరావు భార్య వీరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బొలెరో ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని దీపామహల్ పెట్రోల్‌బంక్ ఎదురుగా బొలేరో వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట సుధాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 35 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి.. రామలక్ష్మణ కూడలి నుంచి సూర్యమహాల్ వైపు నడుచుకుని వస్తుండగా జలుమూరు మండలం ఉద్దాకులపేట గ్రామానికి చెందిన కె.వి.జోగారావు రాంగ్‌రూట్‌లో తన బొలేరో వాహనాన్ని అకస్మాత్తుగా వెనక్కి తీసి ఢీకొట్టాడు. దీంతో ఆ వ్యక్తి తల, కాళ్లకు తీవ్రగాయాలై స్పృహ కోల్పోయాడు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది వచ్చి రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యచికిత్సకోసం కేజీహెచ్‌కు తరలించేందుకు సమాయత్తమవుతుండగా వ్యక్తి మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ముగ్గురిపై కేసు నమోదు

హిరమండలం: మాళువ పరిధిలో ఈనెల 24న అడవి పందిని వేటాడి మాంసాన్ని వాటాలు వేసుకున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పాతపట్నం అటవీశాఖ రేంజర్ అమ్మనాయుడు ఆదివారం విలేకరులకు తెలిపారు. తుంగతంపర గ్రామానికి చెందిన జి.లక్ష్మీనారాయణ, సీహెచ్ లక్ష్మీనారాయణ, అవలంగి గ్రామానికి చెందిన ఎల్.లోకేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు చెప్పారు.

నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా


నినాదాలు చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విశ్వమానవ సమానత్వం కోసం తన కలంతో గర్జించిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని బడుగు, బలహీనవర్గాల నాయకులు పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని మహాత్మా జ్యోతిరావు పూలే పార్కులో ఆదివారం జాషువా 130వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆనాటి సమాజంలో ఉన్న కుల వివక్షత, అణచివేత, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా తన కలాన్ని ఆయుధంగా మలిచి గబ్బిలం, ఫిరదౌసి, కాందిశీకుడు వంటి అనేక రచనలు ద్వారా సమాజాన్ని చైతన్యపరచినా గొప్ప కవి గుర్రం జాషువా అని కొనియాడారు. బడుగు, బలహీనవర్గాలతో పాటు మహిళల సమానత్వం కోసం అనేక రచనలు చేశారన్నారు. యువత ఆయన అడుగుజాడల్లో నడుచుకోవడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం, దళిత సంఘాలు, బహుజన నాయకులు కళ్ళేపల్లి రాంగోపాల్, కంఠ వేణు, అమీరుల్లా బేగ్, గద్దిబోయిన కృష్ణ, కాగిత వెంకటరావు, యజ్జల గురుమూర్తి, కిల్లాన శ్రీనివాస్, ఆలాపన త్రినాథ్‌రెడ్డి, బోనెల రమేష్, సీర రమేష్‌బాబు, పడాల ప్రతాప్‌కుమార్, పురుషోత్తం రాంబాబు, యద్ల జానకీరావు, సాంబారిక సూరిబాబు, గొల్లపల్లి నందేశ్ పాల్గొన్నారు.

వైభవంగా ఆర్ఎస్ఎస్ శత వార్షికోత్సవం

- భారీగా తరలివచ్చిన స్వయం సేవకులు


పాల్గొన్న నాయకులు


మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ నాయకులు డాక్టర్ భాగేశ్వర్ త్రిపాఠి


విన్యాసాలు చేస్తున్న సంఘ సేవకులు


ప్రముఖుల చిత్రపటాలకు నివాళులర్పించిన దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక సరస్వతీ శిశు విద్యామందిర్ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతవార్షిక వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భారత్ మాత, ఆర్ఎస్ఎస్ ప్రవచనకర్త డాక్టర్ హెగ్డేవర్ చిత్రపటాలకు సేవకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ్ శతవార్షిక వేడుకలకు బరంపురం నుంచి సీనియర్ నాయకులు డాక్టర్ భాగేశ్వర్ త్రిపాఠి విచ్చేసి మాట్లాడారు. 1925 విజయదశమి రోజున ఆర్.ఎస్.ఎస్ నాగ్‌పూర్‌లో ఉద్భవించిందని గుర్తు చేశారు. అప్పటి నుంచి అనేక రాష్ట్రాలలో సంఘ్ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్టు వివరించారు. 1942లో సంఘ్ కార్యకర్తలు భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని, అలాగే 1952 సంఘ్ సేవలను అప్పటి భారత ప్రభుత్వం గుర్తించిందన్నారు. కేవలం 1975 ఎమెర్జెన్సీ కాలంలో దేశంలో ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు సంఘ్ కార్యకలాపాలను నిషేధించినట్టు వివరించారు. 1962లో ఇండో –చైనా యుద్ధంలో మిలటరీకి మెడికల్ సేవలు అందించారని అన్నారు. బాబ్రీ మసీదు కూల్చివేత సమయంలో కూడా ఆర్ఎస్ఎస్‌ను నిషేధించారని చెప్పారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ ప్రపంచ నలుమూలలా శాఖలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. విదేశాలలో సంఘ్‌ను హిందూ స్వయం సేవక్ సంఘ్‌గా పిలుస్తున్నారన్నారు. దేశంలో హిందుత్వాన్ని కాపాడుతున్న ఏకైక సంస్థ ఆర్ఎస్ఎస్ అని కొనియాడారు. నేటికి సంస్థ ఏర్పాటై వందేళ్లు పూర్తయినట్టు పేర్కొన్నారు. దేశంలో గోవధను నిషేధించాలని అనేక ఆందోళనలు జరిపామని చెప్పారు. అనంతరం సంఘ్ గజపతి జిల్లా నాయకులు మన్మోహన్ రాజగురు, దండార్ పండా మాట్లాడి సంఘ్ కార్యకర్తలను ఉత్సాహ పరిచారు. వార్షిక వేడుకలకు విశ్వ హిందూ పరిషత్ నాయకులు మహంత రామానంద్ దాస్, జిల్లా అధ్యక్షులు అనాది పాణిగ్రాహి, సి.హెచ్.సింహాద్రి, ముల్లి గోపాలరావు, జిల్లా నలుమూలల నుండి సంఘ్ కార్యకర్తలు హాజరయ్యారు. కార్యకర్తల విన్యాసాలు అలరించాయి.

పోలీస్ గ్రౌండ్‌లో దేవీ ఉత్సవాలు ప్రారంభం


ఉత్సవాల ప్రారంభ పూజలు చేస్తున్న దృశ్యం


పర్లాకిమిడి నీలమణి గ్రామదేవత వద్ద దుర్గాష్టమి పూజలు


బెత్తగుడ పోలీసు ట్రైనింగ్ సెంటర్‌వద్ద విద్యుత్ అలంకరణ

పర్లాకిమిడి: బెత్తగుడ వద్ద ఉన్న పోలీసు బెటాలియన్ గ్రౌండ్‌లో అష్టమి అయిన ఆదివారం దేవీ నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ వేడుకలను జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా ప్రారంభించగా.. పోలీసు బెటాలియన్ కమాండెంట్ అశోక్ కుమార్ మహంతి, అసిస్టెంట్ కమాండెంట్ ఖండర్పపాత్రో తదితరులు పాల్గొన్నారు. ఈనెల 30న బరంపురం సంగీత కళాకారులచే మెలోడీ కార్యక్రమం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందని పోలీసు అధికారులు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక


నిర్వాహకులతో ఎమ్మెల్యే కద్రక


ఫైనల్‌లో హోరాహోరీగా ఆడుతున్న క్రీడాకారులు



విజేతలతో ఎమ్మెల్యే కద్రక

రాయగడ: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, నేటి యువత క్రీడలపై ఆసక్తి కనబరుస్తుండటం శుభపరిణామమని రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక అభిప్రాయపడ్డారు. స్థానిక బిజుపట్నాయక్ ఇండోర్ స్టేడియంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బ్యాట్‌మింటన్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. క్రీడా రంగంలో యువత రాణించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ప్రోత్సాహిస్తున్న తరుణంలో ఇటువంటి తరహా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరిచి ఉత్తమ క్రీడాకారుడిగా గుర్తింపు పొందాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నప్పటికీ వారికి సరైన ప్రోత్సాహం లేకపోవడంతో ఆయారంగాల్లో రాణించలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని గ్రామీణ క్రీడాకారులకు చేయూతనందించాలని ఆకాంక్షించారు. ఈ పోటీల్లో 150 మంది వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారని నిర్వాహకులు వివరించారు. సింగిల్స్, డబల్స్, మిక్స్ డబల్స్ మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో భాగంగా 15 ఏళ్ల లోపు సింగిల్స్ విభాగంలో జరిగిన పోటీల్లో హర్షిత్ ప్రియదర్స్ బెహర విజేతగా నిలిచాడు. బాలికల సింగిల్స్ విభాగంలో సంవృద్ధి రాజ్ బిశ్వాల్ టైటిల్‌ను సాధించారు. బాలుర డబల్స్ విభాగంలో ఆయుంక కుమార్ సాహు, హర్షిత్ ప్రియదర్శి బెహర టైటిల్‌ను సాధించారు. బాలికల విభాగం డబల్స్‌లో దీప్తిమయి, శర్మ, అల్యాణ ప్రధాన్‌లు గెలిచారు. అదే విధంగా 17 ఏళ్ల లోపు బాలుర కేటగిరీలో సింగిల్స్‌లో సౌమ్యజీత్ సాహు, బాలికల విభాగంలో అంశమాన్ పురోహిత్‌లు గెలిపొందారు. ఒడిశా రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాయగడ శాఖ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.

నువాపడా ఉప ఎన్నికలో త్రిముఖ పోరు



భువనేశ్వర్: పశ్చిమ ఒడిశాలో నువాపడా శాసనసభ నియోజకవర్గంలో త్వరలో ఉప ఎన్నిక జరుగనుంది. అధికార పక్షం భారతీయ జనతా పార్టీ, విపక్షం బిజూ జనతా దళ్, కాంగ్రెస్ మధ్య త్రిముఖ పోరు నెలకొంది. నువాపడా నియోజకవర్గ సిటింగ్ ఎమ్మెల్యే రాజేంద్ర ఢొలాకియా అకాల మరణంతో ఉప ఎన్నిక తప్పనిసరి అయింది. ఆయన ఇక్కడి నుంచి నాలుగు సార్లు శాసన సభ్యుడిగా ఎన్నికయ్యారు. సానుభూతి పవనాల్ని సానుకూలంగా మలుచుకునేందుకు విపక్ష బిజూ జనతా దళ్ దివంగత ఎమ్మెల్యే కుమారుడు జాయ్ ఢొలాకియాను ఈ ఉప ఎన్నికలో నిలబెట్టాలని నిర్ణయించింది. ఈ స్థానం నిలుదొక్కుకునేందుకు నువాపడా బీజేడీ సమగ్రంగా ఏకమై పోరాడుతుందని జాయ్ ఢొలాకియా తెలిపారు. పార్టీలో గందరగోళం సృష్టించడానికి ప్రత్యర్థి పార్టీలు తనను సంప్రదించాయనే తప్పుడు వార్తలు ప్రసారం చేస్తున్నారని మండిపడ్డారు.

- గత ఏడాది ముగిసిన జంట ఎన్నికల్లో బీజేపీ చరిత్రాత్మక విజయం తర్వాత మోహన్ చరణ్ మాఝి, మన్మోహన్ సామల్ ద్వయానికి ఈ ఉప ఎన్నిక తొలి ఎన్నికల పరీక్ష అవుతుంది. ఈ ఎన్నికలో బీజేపీ విజయం సభలో సంఖ్యాబలం పెంచడమే కాకుండా 2024 విజయం యాదృచ్ఛికం కాదని నిరూపిస్తుంది.
- గత ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచిన అభినందన్ పండాను బీజేపీ తిరిగి అభ్యర్థిగా ప్రకటించే అవకాశం ఉంది. 2014లో కాషాయ పార్టీ తరఫున గెలిచిన బసంత పండా కుమారుడు అభినందన్ పండా నువాపడాలో మంచి సంస్థాగత గుర్తింపు పొందారు. రాష్ట్రంలో పూర్వ వైభవాన్ని కూడగట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్న కాంగ్రెస్ 2024లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఘసిరామ్ మాఝికి టికెట్ ఇవ్వవచ్చని ఓపీసీసీ అధ్యక్షుడు భక్త దాస్ సూచించారు. ఘసిరామ్ పాతతరం వ్యక్తి. నియోజక వర్గంలో ఆయనకు స్వతహాగా బలమైన నాయకునిగా గుర్తింపు ఉంది. 2024 ఎన్నికల్లో ఆయన స్వతంత్ర అభ్యర్థిగా 50,000 కంటే ఎక్కువ ఓట్లు సాధించి రాజేంద ఢొలాకియా తర్వాత రెండవ స్థానంలో నిలిచాడు. ఘసిరామ్ 2014, 2019 ఎన్నికలలో కాంగ్రెస్ టిక్కెట్‌పై పోటీ చేసి విఫలమయ్యాడు. అప్పటి ఓపీసీసీ అధ్యక్షుడు శరత్ పటానాయక్ గత ఎన్నికల్లో నాల్గవ స్థానంలో నిలిచారు. 2024 ఎన్నికల్లో ఘసిరామ్ 50,000 ఓట్లతో శరత్ పట్నాయక్ సాధించిన 15,000 పార్టీ ఓట్లతో ఈ ఉప ఎన్నికలో విజయం సాధించాలని కాంగ్రెస్ ఆశిస్తోంది. అవిభక్త కలహండి జిల్లాలో భక్త చరణ్ దాస్ సత్తా చాటుకునేందుకు ఈ ఉప ఎన్నిక అగ్ని పరీక్షగా నిలవనుంది. పీసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కాంగ్రెస్ తాజా బలం ప్రదర్శించేందుకు ఇదో చక్కని అవకాశం. ఒడిశాలో కాంగ్రెస్ పుంజుకుంటుందని నిరూపించడానికి ఈ ఉప ఎన్నికలో గెలవడానికి భక్త చరణ్ దాస్ వ్యూహ రచనలో తలమునకలై ఉన్నారు.

30న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన


ముంజేటి కృష్ణమూర్తి

గార: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 30న జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడతామని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ సూచనలతో జిల్లాలోని అన్ని దళిత సంఘాలను సమన్వయం చేస్తూ, పార్టీ అనుబంధ విభాగాలతో నిరసన ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రైవేటీకరణ వెనక్కి తీసుకునే వరకు ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. పేద ప్రజల ఆరోగ్యానికి నష్టం చేకూర్చేలా కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు హేయమన్నారు. నిరసన కార్యక్రమంలో జిల్లా అన్ని విభాగాల నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గంజాయితో పట్టుబడిన రౌడీషీటర్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని డచ్‌బంగ్లా వద్ద రెండు కిలోల గంజాయితో నగరానికి చెందిన ఓ రౌడీషీటర్ పట్టుబడ్డాడు. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక మంగువారితోట కంద్రవీధికి చెందిన బొమ్మలాట హరికృష్ణ ఒడిశాకు చెందిన గుర్తుతెలియని వ్యక్తి వద్ద నుంచి గంజాయిని తెచ్చి డచ్‌బంగ్లా సమీపంలో విక్రయం చేసేందుకు వేచి ఉండగా ఎస్ఐ ఎం.హరికృష్ణ సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. గతంలో ఓ మహిళపై అఘాయిత్యానికి సంబంధించి కేసులో హరికృష్ణపై షీట్ ఓపెన్ అవ్వడం, కొట్లాట కేసు కూడా ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితుడిని అరెస్టు చేసినట్లు, కేసును సీఐ పైడపునాయుడు దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటో పట్టణ పోలీసులు పేర్కొన్నారు.

జనసేనలో వర్గ విభేదాలు

కంచిలి: జనసేన పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ నాయకత్వంపై జిల్లా పార్టీ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్‌కు స్థానిక పార్టీ నేతలు ఆదివారం ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలో కష్టపడే నాయకులకు, జన సైనికులకు, వీర మహిళలకు గుర్తింపు ఉండటం లేదని, ఇదేంటని ప్రశ్నిస్తే తాము వేరే పార్టీ వాళ్లమంటూ వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ దుర్భాషలాడుతూ గొడవలు సృష్టిస్తున్నారని వాపోయారు.

పేకాట శిబిరంపై దాడి

శ్రీకాకుళం రూరల్: సింగుపురం జాతీయ రహదారి పరిసర ప్రాంతంలో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న ఐదుగురిని రూరల్ పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి నాలుగు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్‌లు, రూ.6810 నగదు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు


రాజనగర్ కూడలి వద్ద పూజలు అందుకుంటున్న కనకదుర్గ


కనకదుర్గా పూజా మండపం వద్ద స్వాగత పెండాల్


కనకదుర్గకు పూజలు చేస్తున్న భక్తులు

జయపురం: జయపూర్ రాజనగర్ కూడలి వద్ద కనకదుర్గా పూజా మండపంలో పూజలు చేసేందుకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి భక్తులు కనకదుర్గకు పూజలు చేసేందుకు భక్తులు రావటం కనిపించింది. భకుల్తు దేవికి దీపారాధనలు చేశారు. ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం పూజా కమిటీలు దుర్గా మాత శోభాయాత్ర, నిమర్జనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. మైక్‌లు, బాణ సంచాలపై అధికారులు ఆంక్షలు విధించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు చేపడతామని పట్టణ పోలీసు అధికారి ఉల్లాస్ చంద్ర రౌత్ స్పష్టం చేశారు. సంస్కృతిక కార్యక్రమాలు రాత్రి 12 గంటల వరకు మాత్రమే నిర్వహించాలని సూచించారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: బన్నువాడకు చెందిన వట్టికూళ్ల కూర్మారావు(56) పాముకాటుకు గురై ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. కూర్మారావు పొలం పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. తీవ్ర అస్వస్థతకు గురికావడంతో స్థానికులు హుటాహుటిన టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కూర్మారావుకు భార్య సరస్వతి, కుమార్తె ఉన్నారు. కూర్మారావు మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

వైభవంగా దసరా సంబరాలు


భార్య మీనాక్షీ బాహిణీపతితో కోలాటమాడుతున్న ఎమ్మెల్యే


జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించిన ఎమ్మెల్యే బాహిణీపతి


ఒడిస్సీ నాట్యకారిణి మున్నాను సత్కరిస్తున్న దృశ్యం


కళాకారిణి అంకితకు సత్కారం

జయపురం: చరిత్రాత్మక జయపురం దసరా త్సవాలు ప్రశాంత వాతావరణంలో దిగ్విజయంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే జయపురం మహోత్సవ కమిటీ అధ్యక్షుడు తారాప్రసాద్ బాహిణీపతి విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక సౌరావీధి మా బసంతి దేవి ఆలయ కూడలి వద్ద జయపురం దసరా సాంస్కృతిక సంబరాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వీర సైనికుడు నరశింగ నాయిక్, కళాకారిణి అంకిత, మధుర గాయకుడు, కళాకారుడు రచయిత లింగరాజు సాహు, నాట్య కళాకారిణి మున్న మిశ్ర, ఉపాధ్యాయులు కె.వెంకటరమణ తదితరులను అవార్డులతో సత్కరించారు.

కబళించిన కిడ్నీ మహమ్మారి

పొందూరు: కృష్ణాపురం గ్రామంలో కిడ్నీ మహమ్మారి మరొకరిని కబలించింది. ఏటా ఈ గ్రామంలో పదుల సంఖ్యలో మృతి చెందుతున్నారు. తాజాగా గార వెంకటమ్మ (48) అనే మహిళ ఆదివారం మృతి చెందింది. ఈమె రెండేళ్లుగా డయాలసిస్ చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమించడంతో మృత్యువాతపడింది. ఈమెకు భర్త రమణ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గ్రామంలో ఇప్పటికే 20 మంది కిడ్నీ సమస్యతో మరణించగా, పదుల సంఖ్యలో చికిత్స పొందుతున్నారు.

నైపుణ్యాలతోనే ఉపాధి అవకాశాలు


జ్యోతిప్రజ్వలన చేస్తున్న సీఓఓ

శ్రీకాకుళం రూరల్: పోటీ ప్రపంచంలో విద్యార్హతలు కంటే నైపుణ్యత ఉంటేనే రాణించగలమని జెమ్స్ సీఓఓ శ్రీధర్‌రెడ్డి అన్నారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో బొల్లినేని బీఎస్సీ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా వైద్యరంగంలో ఎన్నో మార్పులు జరుగుతున్నాయని, ప్రత్యేక నైపుణ్యం కలిగిన వారు మాత్రమే ఈ రంగంలో రాణించగలరని చెప్పారు. బీఎస్సీ ఎలైడ్ హెల్త్‌కేర్ కోర్సులకు మంచి డిమాండ్ ఉందన్నారు. జెమ్స్ మెడికల్ డైరెక్టర్ హేమంత్ మాట్లాడుతూ రోగికి వైద్య చికిత్సలో ఎలైడ్ హెల్త్ కోర్సు విద్యార్థుల పాత్ర కీలకమని చెప్పారు. వైద్యుని తరువాత స్థానం వీరిదేనన్నారు. బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టుదలతో చదివితే విజయం సొంతమవుతుందన్నారు. అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మీ పద్మజ మాట్లాడుతూ కళాశాల దశమ వార్షిక ప్రణాళిక, సాధించిన ప్రగతిని వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

క్లుప్తంగా

కోట దుర్గమ్మకు పంచలోహ కవచం వితరణ



అమ్మవారి విగ్రహానికి పంచలోహ కవచాన్ని వితరణగా అందజేస్తున్న దూళికేశ్వరరావు

కురుపాం: స్థానిక రావాడ జంక్షన్‌లో వెలసిన కోట దుర్గమ్మవారికి కీర్తిశేషులు నడుకూరు దుర్గ భవాని ప్రసాద్ దంపతుల కుమారుడు నడుకూరు దూళికేశ్వరరావు ఆదివారం అమ్మవారి విగ్రహానికి రూ.లక్షా ముప్పై వేల విలువైన పంచలోహ కవచం వితరణగా అందజేశారు. ఈ మేరకు ఆలయ అర్చకుడు శ్రీనివాస నాయక్, ఆలయ కమిటీ సభ్యులకు పంచలోహ కవచాన్ని అందజేసి అమ్మవారికి అలంకరించాలని కోరారు.

50 మందిపై తేనెటీగల దాడి



కొండవెలగాడ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పారసాం గ్రామంలో తేనెటీగలు ఆదివారం బీభత్సం సృష్టించాయి. గ్రామ దేవతల ఉత్సవాల సందర్భంగా గ్రామస్తులు అమ్మవారి సన్నిధికి వెళ్లగా డీజే శబ్దాలకు స్థానిక శివాలయం వద్ద ఉన్న తేనె తుట్ట చెలరేగడంతో ఈగలు స్థానికులపై విచ్చలవిడిగా దాడి చేశాయి. దాడి జరిగిన సమయంలో సుమారు 200 మంది ఉండగా వారిలో 50 మందిని తేనెటీగలు గాయపరిచాయి. తీవ్రంగా గాయపడిన ఆరుగురిని కేంద్రాస్పత్రికి తరలించగా మిగిలిన వారికి కొండవెలగాడ పీహెచ్‌సీలో చికిత్స అందించారు. క్షతగాత్రుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో పారసాం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

నేటి నుంచి రిలే నిరాహార దీక్షలు

- జిందాల్ నిర్వాసితుల నిర్ణయం



నిర్వాసితురాలు గద్దమ్మను సన్మానిస్తున్న రఘురాజు, జగన్

శృంగవరపుకోట: కంపెనీ ఏర్పాటు పేరుతో జిందాల్ తీసుకున్న తమ భూములు తమకే ఇవ్వాలని చేస్తున్న జిందాల్ నిర్వాసితుల దీక్షలు 100వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా నాలుగెకరాల భూమి కోల్పోయి నిరసన చేస్తున్న వందేళ్ల వృద్ధురాలు గొండ గద్దమను ఎమ్మెల్సీ రఘురాజు, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ తదితరులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఒక్కో రోజు ఒక్కో గ్రామానికి చెందిన నిర్వాసితులు నిరాహార దీక్షలు చేయాలని నిర్ణయించారు. అనంతరం నిర్వాసితులు మాట్లాడుతూ ఇంత వరకూ తమ పోరాటాలతో అన్ని వర్గాల వారి అభిమానం సాధించుకున్నామని, మన పోరాటానికి ప్రభుత్వం నుంచి మాత్రం స్పందన కరువైందని, నిద్దరోతున్న ప్రభుత్వాన్ని లేపడానికి నిరాహారదీక్షలు చేయాల్సి రావడం సిగ్గుచేటన్నారు. ఈ పోరాటంలో నిర్వాసితులతో చివరి వరకూ ఉండి, మద్దతిస్తామని రఘురాజు, జగన్‌లు తెలిపారు.

అరకుకు దీటుగా అందాలు

- పాచిపెంటలో అందాలెన్ని ఉన్నా వసతులు శూన్యం
- కలగా మిగులుతున్న పర్యాటకం
- ఇబ్బందులు పడుతున్న పర్యాటకులు



ధారాగెడ్డ జలపాతం



పెద్దగెడ్డ జలాశయం



శతాబివద్ద కనువిందు చేస్తున్న పచ్చని పోడు భూములు



పెద్దగెడ్డ సమీపంలో ఉన్న శివాలయం

పాచిపెంట: ఎత్తైన జలపాతాలు, వాటి నుంచి వచ్చే నీటి సవ్వడులు, అడవి తల్లి ఆకుపచ్చ చీరను కట్టుకునేలా కనిపించే ప్రకృతి, మేఘాలు మనుషులను తాకే అనుభూతి కలిగించే కొండలు ఇలా అద్భుతమైన స్వచ్ఛమైన ప్రకృతి ఆస్వాదాన్ని అందించే అద్భుతమైన పర్యాటక అందాలు మన్యం జిల్లా సొంతం. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోటిలో శని ఉందన్న చందాన పార్వతీపురం మన్యం జిల్లా పర్యాటకం పరిస్థితి ఉంది. ఇన్ని అందాలు ఉన్నా ఈ జిల్లా పర్యాటక ప్రాంతం దిశగా అడుగులు పడుతున్న పరిస్థితులు లేవు. అరకు ప్రాంతానికి దీటుగా ఉన్న అద్భుతమైన మన్యం అందాలను ఆస్వాదించేందుకు ఆసక్తి చూపుతున్న పర్యాటకులకు ఇక్కడ వసతులు సమస్యతో ప్రత్యామ్నాయంగా అరకు వైపు వెళ్తున్న పరిస్థితి నెలకొంది.

మన్యం జిల్లాలోని పాచిపెంట మండలంలో పర్యాటకం గురించి పరిశీలిస్తే, పర్యాటక ప్రాంతంగా పాచిపెంట అభివృద్ధి కలగానే మిగులుతోందని స్థానికులు వాపోతున్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞంలో భాగంగా మొదటగా పాచిపెంట మండల కేంద్రంలో పెద్దగెడ్డ జలాశయాన్ని పూర్తిచేసి జాతికి అంకితం చేశారు. ఆ సమయంలో హెలికాప్టర్ ద్వారా ఆయన ఈ ప్రాంతం అందాలను వీక్షించి ముగ్ధులై ఇక్కడ పర్యాటక ప్రాంత అభివృద్ధికి ఈ జలాశయం సమీపంలో మూడు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. తరువాత ఆయన మరణంతో ఇక్కడ పర్యాటక అభివృద్ధి పనులు నిలిచిపోగా ఈ ప్రాంతమంతా తుప్పలు, డొంకలతో దర్శనమిస్తున్న దుస్థితి.

పర్యాటకానికి అనువైన ప్రదేశాలు

చుట్టూ పచ్చని కొండలు, మధ్యలో పెద్దగెడ్డ జలాశయం చూపరులను ఆకట్టుకుంటుంది. జలాశయానికి 50 మీటర్ల దూరంలో ప్రసిద్ధి చెందిన పురాతన శివాలయం ఉంది. ఈ శివాలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, అక్కడే ఉన్న జలాశయం అందాలను ఆస్వాదిస్తారు. ఇక్కడ బోటుషికారుతో పాటు మిగిలిన సదుపాయాలు లేకపోవడంతో పర్యాటకులు ఎక్కువ సమయం ఇక్కడే ఉండి ఆస్వాదించలేని పరిస్థితి నెలకొంది. కాగా ఈ పక్కనే ధారాగెడ్డ జలపాతం ఉంది. ఎత్తైన కొండల మధ్య నుంచి జారే ఈ జలపాతానికి అక్టోబరు నుంచి జనవరి వరకు ప్రతి రోజూ వందల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. ఇది మంచి పిక్నిక్ ప్రాంతంగా పేరొందింది. అయితే ఇక్కడికి వెళ్లడానికి రోడ్డు సదుపాయం లేదు. తుప్పలు, డొంకల మధ్యలో నుంచి కాలినడకన ఈ ప్రాంతానికి అతికష్టం మీద వెళ్తున్నారు.

మైమరపించే శతాబి అందాలు

మండల కేంద్రానికి సుమారు 8 కి.మీ.దూరంలోనే శతాబి అనే ప్రాంతం ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ ప్రాంతానికి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టింది. ఈ ప్రాంతానికి వెళ్లే దారిలో చుట్టూ పచ్చని కొండలు అక్కడక్కడ జలపాతాలు కనిపిస్తుంటాయి. జలపాతాల నుంచి వచ్చే నీటిని ఒడిసి పట్టి అక్కడ గిరిజనులు సాగుచేసే పోడు వ్యవసాయం పచ్చని సౌందర్యంతో కనువిందు కలిగిస్తుంది. ఈ ప్రాంతంలో ఉండే కాఫీ తోటలు అదనపు ఆకర్షణ. ఈ ప్రాంతానికి వెళ్లే సమయంలో ప్రకృతి అందాలకు ప్రతి ఒక్కరూ మంత్రముగ్ధులు కావడం ఖాయం.

ప్రణాళికలే గాని పనులు లేవు

జిల్లాల పునర్విభజన అనంతరం జిల్లాకు రెండవ కలెక్టర్‌గా వచ్చిన శ్యామ్‌ప్రసాద్ పాచిపెంటలో పర్యాటక అందాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. ఒక రోజంతా పాచిపెంటలో పర్యాటక అందాలను ఆస్వాదించారు.ఈ క్రమంలో ఇక్కడ పర్యాటక అభివృద్ధి చేయాలని భావించి, దీనిపై ప్రణాళికలు సిద్ధం చేసి ఇవ్వాలని నాటి ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌ను ఆదేశించడంతో పాటు ఆయనను దీనికి ప్రత్యేకాధికారిగా నియమించారు. కలెక్టర్ ఆదేశాలతో లక్ష్మీకాంత్ పర్యాటక ప్రాంతాలను గుర్తించి వాటి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి కలెక్టర్‌కు నివేదికలు అందించారు. ఆ నివేదికల ఆధారంగా నిధుల మంజూరుకు కలెక్టర్ ప్రతిపాదనలు పంపించారు. అయితే ఆ నిధులు మంజూరు కాకముందే ప్రత్యేకాధికారిగా నియమితులైన ఎంపీడీఓ లక్ష్మీకాంత్, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లు బదిలీపై వెళ్లిపోయారు. దీంతో ఈ పర్యాటక ప్రాంత అభివృద్ధి కల మళ్లీ మొదటికే వచ్చింది.

కలెక్టర్‌పైనే ఆశలన్నీ..

ప్రస్తుత కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి స్పందించి ఈ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధి చేపట్టి పర్యాటకులు, ఇక్కడి ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని పర్యాటకులు, గిరిజనులు కోరుకుంటున్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు



ఉత్సాహంగా వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

విజయనగరం గంటస్తంభం: భగత్‌సింగ్, మహాత్మా గాంధీ జయంతుల సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐల ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీలు ఎంఆర్ గ్రౌండ్‌లో ఆదివారం పోటాపోటీగా జరిగాయి. ఒకటవ పట్టణ ఎస్సైలు లక్ష్మీప్రసన్నకుమార్, లక్ష్మునాయుడులు పాల్గొని భగత్‌సింగ్, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి క్రీడాపోటీల వల్ల విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి కలుగుతుందన్నారు. ఈ క్రీడాపోటీల్లో జిల్లా స్థాయిలో విన్నర్‌గా జేఎన్‌టీయూ టీమ్, రన్నరప్‌గా జీఎంఆర్‌ఐటీ టీమ్ నిలిచాయి.

మొదటి విజేతకు రూ.10వేలు, ద్వితీయ విజేతకు రూ.5వేలు నగదు బహుమతులు అందజేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు డి.రాము, సీహెచ్.వెంకటేష్‌లు మాట్లాడుతూ భగత్ సింగ్,గాంధీజీ స్ఫూర్తితో ఏటా యువతలో క్రీడాప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ సీహెచ్ హరీష్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పాము కాటుతో పాడిగేదె మృతి



మృతిచెందిన పాడిగేదె, పక్కనే బాధితురాలు వెంకటలక్ష్మి

వేపాడ: మండలకేంద్రం వేపాడలో పాము కాటుకు గురై పాడి గేదె మృతి చెందింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. వేపాడ గ్రామానికి చెందిన రైతు వెంకటలక్ష్మి శనివారం రాత్రి పాడిగేదెను కట్టివేసి ఇంటికి వచ్చివేసింది. ఆదివారం ఉదయం కళ్లంలోకి వెళ్లేసరికి పాడిగేదె పాము కాటుకు గురై మృతిచెందినట్లు గుర్తించి కన్నీరుమున్నీరై విలపించింది. మృతిచెందిన గేదె విలువ సుమారు 1.25లక్షలు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

ఘనంగా మిస్టర్ ఆంధ్ర పోటీలు ప్రారంభం



మిస్టర్ ఆంధ్రా ప్రదర్శనలో పాల్గొన్న కనకల ఎర్రయ్య మెమోరియల్ అధ్యక్షుడు, సభ్యులు

విజయనగరం గంటస్తంభం: పట్టణంలోని ఆనంద గజపతి కళాక్షేత్రం వేదికగా కనకల ఎర్రయ్య మెమోరియల్ మిస్టర్ ఆంధ్రా రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీలు వైభవంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. విజయనగరం జిల్లా బాడీబిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాడీబిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకల కృష్ణ మాట్లాడుతూ, కనకల ఎర్రయ్య జ్ఞాపకార్థం ఈ ఏడాది 12వ మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. దసరా, పైడితల్లి అమ్మవారి ఉత్సవాల సందర్భాన్ని పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహించడం విశేషమన్నారు. ఈ సారి మొత్తం 164 మంది క్రీడాకారులు పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించారని వెల్లడించారు. విజేతలకు రూ.1.30 లక్షల నగదు ప్రోత్సాహకంతో పాటు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. క్రీడాకారులందరికీ తగిన వసతులు కల్పించామని, ఈ పోటీల ద్వారా విజయనగరం ప్రతిష్ఠను రాష్ట్రవ్యాప్తంగా చాటుకోవడమే లక్ష్యమని అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, కార్యదర్శి బైక్ రమేష్, నాయకులు పిన్నింటి సూర్యనారాయణ, రాఘవరెడ్డి, రాజేందర్ రెడ్డి, జనప్రియ శ్రీనివాస్, శ్రీనివాస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎందుకంత ఆవేశం..!

- ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యేను పక్కన పెట్టి భర్త చిందులు
- తాట తీస్తానంటూ మీడియాకు వార్నింగులు



సమావేశంలో మాట్లాడుతూ ఆవేశంతో ఊగిపోతున్న లోకం ప్రసాద్

పూసపాటిరేగ: ఆయన హోదా చాలా పెద్దది. ఎమ్మెల్యేకే ఆయనగారు మరి. అందుకే ప్రెస్‌మీట్ పెట్టి ఎమ్మెల్యేను, జనసేన నాయకులను జస్ట్ అలా కూర్చోమని చెప్పి ఆట మొత్తం ఆయనే ఆడేశారు. పెద్దరికానికి పెత్తనానికి అలవాటు పడిన ప్రాణం కాబట్టి విలేకరుల సమావేశంలో కూడా ఆయనే పెత్తనం చేసి ఎమ్మెల్యే ఆడాల్సిన ఆటను కూడా ఆయనే ఆడేశారు. ఎమ్మెల్యే చేసిన తప్పులు అధికారం మాటున ఎమ్మెల్యే చేసిన పనులు..జనానికి చూపిస్తున్న సినిమాను బయటపెట్టిన మీడియాపై ప్రసాద్ చిందులు తొక్కారు. తప్పులు ఎత్తి చూపినందుకు వాటిని సరిదిద్దుకోవాల్సింది పోయి తాట తీస్తానంటూ వార్నింగులు ఇచ్చారు. ఆవేశంతో ఊగిపోతూ తానేమిటో చూపిస్తానంటూ పెద్ద పెద్ద మాటలు ఆడారు. ఇదంతా ఎమ్మెల్యే లోకం నాగమాధవి సమక్షంలో ఆదివారం భోగాపురంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఊహించని విధంగా జరిగిన సన్నివేశం. భోగాపురం జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి విలేకరుల సమావేశం నిర్వహించారు. వందరోజుల్లో వంద కంపెనీలు వస్తాయని గతంలో చేసిన ప్రకటనకు సోషల్‌మీడియాలో తరచూ ట్రోల్ చేస్తున్నారని వందరోజుల్లో వంద కంపెనీలు ఎలా వస్తాయని తిరిగి ఆమె ప్రశ్నించారు. తమ ఆస్తులకు సంబంధించి పన్నులు ఎగవేసిన ఎమ్మెల్యే అని మీడియాలో రాయడం బాధేసిందని ఆమె స్వయంగా తెలిపారు. స్వప్రయోజనాల కోసం అధికార పార్టీ నాయకులే అధికార దుర్వినియోగానికి పాల్పడు తున్నారని పరోక్షంగా నియోజకవర్గం టీడీపీ నాయకులకు చురకలు అంటించారు. మీడియా దుష్ప్రచారం చేస్తోందని ఎమ్మెల్యే భర్త ప్రసాద్ మీడియాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ పరిస్థితుల్లో అలా మాట్లాడాల్సి వచ్చిందో అర్థం చేసుకోకుండా పత్రికలు తప్పుడు కథనాలు రాస్తున్నాయంటూ ఆవేశంతో ఊగిపోయారు. విలేకరులపై ఆవేశంతో ఊగిపోయి తాటతీస్తాను. ప్రజలను తప్పుదోవ పట్టించకండి అంటూనే ఏం పీక్కుంటారో పీక్కొండి అంటూ ఏక అసభ్య పదజాలంతో మాట్లాడడంతో సమావేశానికి వచ్చిన వారు నిశ్చేష్టులయ్యారు.

ఎమ్మెల్యే క్షమాపణ

ప్రెస్‌మీట్‌లో ఆవేశంతో మాట్లాడిన మాటల్లో ఏవైనా తప్పులు మాట్లాడి వుంటే క్షమించాలని మీడియాకు ఎమ్మెల్యే నాగమాధవి క్షమాపణ చెప్పారు.

హృదయం పదిలమా..!

- మానవుని జీవన శైలిలో మార్పులు
- పెరుగుతున్న గుండెజబ్బులు
- తక్కువ వయసులోనే గుండెపోటు
- బీపీ, సుగర్ నియంత్రణలో ఉంచుకోవాలి



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగికి ఈసీజీ తీస్తున్న టెక్నీషియన్

విజయనగరం ఫోర్ట్: మానవుని ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు వచ్చాయి. ఉరుకులు పరుగులతో జీవనం సాగిస్తున్నారు. అదేవిధంగా శారీరక శ్రమకు దూరమవుతున్నారు. ఉద్యోగులు పని ఒత్తిడికి, నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలు వారు జీవనం ఏవిధంగా సాగించాలనే అనే ఆందోళన, విద్యార్థులకు భవిష్యత్తుపై ఇలా ప్రతి ఒక్కరిలోను ఏదో ఒక ఆందోళన ఉంటుంది.దీని వల్ల అత్యంత ప్రధానమైన గుండెకు హాని జరిగే ప్రమాదం ఉంది. సోమవారం ప్రపంచ గుండె దినోత్సవం. గుండెను పరిరక్షించుకోకపోతే మానవుని ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది. ప్రతి వ్యక్తి గుండెను పరిరక్షించుకోవడం కోసం ప్రత్యేక శ్రద్ధ చూపాలి. సరైన ఆహార నియామలు పాటించకపోవడం, కొవ్వు అధికంగా ఉంటే ఆహార పదార్థాలను అధికంగా తినడం తదితర కారణాల వల్ల ఎక్కువ మంది గుండెజబ్బుల బారిన పడుతున్నారు.

జిల్లాలో నమోదైన గుండెజబ్బులు కేసుల వివరాలు:

సంవత్సరం	నమోదైన కేసులు
2019-20	25,800
2020-21	25,455
2021-22	27,400
2022-23	28,500
2023-24	27,600
2024-25	28,400
2025-26	15,300 (ఆగస్టు నెలాఖరుకు)

వ్యాధిని గుర్తించడం ఇలా

వ్యాధిలో సాధారణంగా ఎటువంటి లక్షణాలు కనిపించవు. బీపీని వైద్యులు పరీక్షల ద్వారానే గుర్తించడం సాధ్యం.రక్తపోటు అధికంగా ఉన్నప్పుడు మాత్రమే కొన్ని లక్షణాలు బయటపడతాయి. తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో కష్టం, ఛాతీలో నొప్పి లక్షణాలు కనిపిస్తాయి.

అధిక రక్తపోటు

రక్తనాళాల్లో రక్తం సాధారణ ఒత్తిడికంటే ఎక్కువ ఒత్తిడితో ప్రసరించినప్పుడు దానిని అధిక రక్తపోటు అంటారు. తరచూ రక్తపోటు తనిఖీ చేయించుకోవాలి. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రక్తపరీక్షలు చేయించుకోవాలి. హైపర్ టెన్షన్ ఉన్నట్లయితే వైద్యుడిని సంప్రదించాలి.

అధిక రక్తపోటుకు కారణం:

నూడిల్స్, చాట్స్, పానీపూరీ వంటి జంక్ ఫుడ్స్ తినడం వల్ల, టీవీ అధికంగా చూడడం వల్ల శారీరక వ్యాయమం లేకపోవడం, ఒకే చోట 8 నుంచి 12 గంటలు పాటు పనిచేయడం, మానసిక ఒత్తిడి, సంఘర్షణ, ఆత్మన్యూనత, పొగతాగడం, ఆల్కహాల్ సేవించడం వంటి వాటి వల్ల అధిక రక్తపోటు వస్తుంది.



గుండెకు శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు

లక్షణాలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించాలి



ఇటీవల కాలంలో గుండెపోటు కేసుల్లో ఎక్కువగా 40 ఏళ్ల లోపు వారు ఉంటున్నారు. ధూమపానం, కొకైన్, డ్రగ్స్, ఖైనీ వంటివి తీసుకోవడం, ఆహారపు అలవాట్లు మారడం, వ్యాయమం లేకపోవడం, విపరీతమైన మానసిక ఒత్తిడి వంటి కారణాలతో గుండెపోటు వస్తుంది. రక్తంచిక్కగా ఉండడం వల్ల సడన్‌గా ఉండెపోటు వస్తుంది. గుండె పోటు లక్షణాలు ఏమాత్రం కనిపించినా వైద్యులను సంప్రదించాలి. పీచుపదార్థాలు ఉండే కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. తాజా పండ్లు తినాలి.

డాక్టర్ జి.సూర్యప్రకాష్, కార్డియాలజిస్టు, విజయనగరం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

ప్రతిరోజు అరగంట పాటు వ్యాయమం చేయాలి. మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా గడపాలి. పొగతాగడం, మద్యం తీసుకోవడం పూర్తిగా మానివేయాలి. యోగా, దైవభక్తి పెంపొదించుకోవాలి. ఉప్పు, మసాలాల వాడకం తగ్గించుకోవాలి. అధికపిండి పదార్థాలు, జంక్ ఫుడ్ తగ్గించుకోవాలి. 30 సంవత్సరాలుపై బడిన వారు ప్రతి 6 నెలలుకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి.

పార్కులో పర్యాటకుల సందడి



జలవిహార్‌లో బోటుషికారు చేస్తున్న పర్యాటకులు



బుల్‌రైడ్ చేస్తున్న దృశ్యం



స్కై సైక్లింగ్ చేస్తున్న యువత



ఫైవ్‌డీ థియేటర్‌లో మూవీ చూస్తున్న చిన్నారులు

సీతంపేట: దసరా సెలవులు కావడంతో విద్యార్థులు,యువత సీతంపేటలోని అడ్వెంచర్ పార్కులో సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో పార్కు కళకళలాడింది. వచ్చిన పర్యాటకులు వివిధ సాహస క్రీడల్లో పాల్గొన్నారు. జలవిహార్‌లో బోటుషికారు, స్కైసైక్లింగ్, బుల్ రైడ్, ఫైవ్‌డీ థియేటర్‌లో అడ్వెంచర్ సినిమాలు చూసి ఆనందించారు. అలాగే మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

జాతరో.. జాతర

- పైడితల్లి సిరిమాను పండగ చాటింపు
- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మనవి చెప్పిన తలయారులు
- అక్టోబరు 6న తొలేళ్లు, 7న సిరిమానోత్సవం
- భక్తులందరూ అమ్మవారిని దర్శించి, తరించండి : ఈవో శిరీష



విజయనగరం టౌన్: తనను కొలిచిన వారికి కొంగుబంగారమై, చింతలు తీర్చే చింతమానును ఎంపిక చేసుకుని సిరిమానుగా మలుచుకుని సిరుల ఉత్సవానికి సిద్ధమవుతున్న చిన్నారి పైడితల్లి జాతర మహోత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఊరూ.. వాడా పండగ వాతావరణం చేసుకోవాలని రామవరపు చినపైడిరాజు బృందం ఆదివారం సాయంత్రం చదురుగుడిలో కొలువైన అమ్మవారికి మనవి చెప్పి ఆలయం ఆవరణలో భాజాభజంత్రిలతో, మేళతాళాల నడుమ పండగ చాటింపు వేశారు. డప్పు వాయిద్యాలతో, ధూపదీప నైవేద్యాలను అమ్మకు సమర్పించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ ఏటా నిర్వహించే సిరిమాను జాతర ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా నిర్వహించేలా చూడాలని అమ్మను ప్రార్థించారు. అనంతరం ఆలయం ఆవరణలో దండోరా వేశారు. అక్టోబరు 6న పైడితల్లి అమ్మవారి తొలేళ్ల సంబరం, 7న సిరుల తల్లి సిరిమానోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని చాటింపు వేశారు. అక్కడ నుంచి డప్పు వాయిద్యాలతో కోట వద్దకు వెళ్లి కోట శక్తికి మనవి చెప్పి చాటింపు వేశారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారిణి కె.శిరీష మాట్లాడుతూ అక్టోబరు 22 వరకూ పండగ ఘనంగా నిర్వహిస్తామని, ప్రధాన ఘట్టాలైన తొలేళ్ల సంబరాలు, సిరిమానోత్సవానికి చాటింపు ప్రక్రియ ఆనవాయితీగా వస్తోందన్నారు. నెల రోజుల పండగలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకోవాలని ఆమె కోరారు.

టాస్క్‌ఫోర్స్ ఉందా? లేదా?

- మాదక ద్రవ్యాల సరఫరాపై కొరవడిన నిఘా
- 'స్పా'సెంటర్లపై కానరాని దాడులు
- మూడు నెలల్లో ముగ్గురు సీఐల బదిలీ



మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

విజయనగరం క్రైమ్: పోలీస్ శాఖలో టాస్క్ ఫోర్స్ ప్రత్యేక విభాగం. సమాజంలో పైకి కనిపించని, పోలీసుల కళ్లు గప్పి చాపకింద నీరులా సాగి పోయే అనైతిక పనులు, చట్టవ్యతిరేక చర్యలకు చెక్ పెట్టేందుకే పోలీస్ శాఖలోంచి ప్రత్యేక విభాగంగా ఏర్పడిందే టాస్క్ ఫోర్స్. జిల్లాలో గంజాయి, డ్రగ్స్, కొకైన్, హెరాయిన్ వంటి మాదక ద్రవ్యాల పంపిణీ జరుగుతుంటే టాస్క్‌ఫోర్స్ నియంత్రించాలి. అయితే జిల్లాలో టాస్క్‌ఫోర్స్‌లో ఆ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. 2023 నుంచి టాస్క్ పోర్స్ వింగ్ పని తీరు జిల్లాలో అంతగా లేదంటే లేదనే పోలీస్ శాఖ చెబుతోంది. ఈ మధ్యనే విశాఖ రేంజ్ డీఐజీ కాస్త దృష్టి పెట్టడంతో జిల్లాలో మాదక ద్రవ్యాలు, గంజాయి అక్రమ రవాణా, స్పాసెంటర్ల పనితీరుపై టాస్క్‌ఫోర్స్ వింగ్‌తో పాటు లా అండ్ ఆర్డర్ పోలీసులు దృష్టి పెట్టారు. ఈ క్రమంలో ఇటీవల ఆర్టీసీ కాంప్లెక్స్, రింగ్ రోడ్‌లో పుట్టుకొచ్చిన స్పా సెంటర్‌లను తనిఖీ చేశారు. రెండు నెలల క్రితం సైబర్ సెల్ సీఐగా ఉన్న బంగారు పాప టాస్క్ ఫోర్స్ సీఐగా బాధ్యతలు చేపట్టి..తనకు వచ్చిన సమాచారంతో రింగ్ రోడ్‌లో ఉన్న ఓ స్పా సెంటర్‌పై దాడి చేసి అక్కడ జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టారు. అ తర్వాత రాజాం ఏరియాలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై కూడా దృష్టి పెట్టాలని ఆమె వెళ్లారు. అయితే అకస్మాత్తుగా ఆ సీఐని వీఆర్ లోకి పంపించింది పోలీస్‌శాఖ. అంతకు ముందు వన్ టౌన్ సీఐగా పని చేసిన డా.వెంకటరావు టాస్క్ పోర్స్ సీఐగా బాధ్యతలు చేపట్టి కొద్ది నెలలైనా కాలేదు. అకస్మాత్తుగా ఆయనను అనకాపల్లి టాస్క్ పోర్స్ సీఐగా బదిలీ చేశారు. ఇప్పుడు ఉత్తరాంధ్ర కల్పవల్లి, విజయనగరం ఆడపడుచు శ్రీశ్రీశ్రీ పైడితల్లి పండుగ వస్తున్న వేళ..టాస్క్ పోర్స్ సీఐగా శోభన్ బాబును నియమించింది పోలీస్ శాఖ. మరి ఇప్పుడున్న పరిస్థితుల్లో మాదక ద్రవ్యాలు, గంజాయి అక్రమ రవాణా, స్పా సెంటర్‌లలో అసాంఘిక కార్యకలాపాలపై కొత్తగా సీఐగా బాధ్యతలు చేపట్టిన శోభన్ బాబు ఏ విధంగా చర్యలు చేపడతారో వేచి చూడాలి.

ఎస్పీ ఆదేశాలతో చర్యలు

అసాంఘిక కార్యకలాపాలపై ఎస్పీ ఆదేశాలతో చర్యలు చేపడుతున్నామని విజయనగరం ఇన్‌చార్జ్ డీఎస్పీ గోవిందరావు అన్నారు. గంజాయి అక్రమ రవాణా నిర్మూలనకు దృష్టి పెట్టామన్నారు. ఈగల్ ఆధ్వర్యంలో కళాశాలలు, పాఠశాల్లో మాదక ద్రవ్యాల వినియోగం, సరఫరాపై అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. టాస్క్ ఫోర్స్ వింగ్ పని తీరు ఏఎస్పీ ఆధ్వర్యంలో ఎస్పీ ఆదేశాలతో జరుగుతోందన్నారు. ముగ్గురు సీఐలు మారడం రోజువారీ శాఖ పనిలో భాగమేనన్నారు.